

పల్లెటూరు.. అమ్మతీరు

వేసవి సెలవులకు పట్టణాల నుంచి చిన్నారులు పల్లెలకు చేరుకున్నారు. చెరువు గట్లు, కాలువలు, మామిడి తోటల్లో ఆనందంగా గడుపుతున్నారు. 8లో▸



నిషేధం ఉన్నా ఆగని దందా

నిషేధిత విత్తనాల దందాకు అడ్డుకట్ట పడటం లేదు. గుట్టుచప్పుడు కాకుండా నకిలీ విత్తనాలను గ్రామాల్లోకి సరఫరా చేస్తున్నారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 43.9 /29.8

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశంలో అక్కడక్కడా మబ్బులు ఉంటాయి. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. మధ్యాహ్నం ఎండ, రాత్రి ఉక్కపోత అధికంగా ఉంటాయి.

న్యూస్‌రీల్

17న పాలిసెట్

ఆసిఫాబాద్‌రూరల్: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 17న పాలిసెట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ గోపాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లాలో నాలుగు కేంద్రాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు రెండు గంటల ముందే కేంద్రాలకు చేరుకోవాలని, గంట ముందే కేంద్రంలోకి అనుమతిస్తారని పేర్కొన్నారు. నిమిషం నిబంధన అమలులో ఉంటుందని తెలిపారు.

21న జిల్లాస్థాయి చెస్‌పోటీలు



మాట్లాడుతున్న సుధాకర్

రెబ్బెన(ఆసిఫాబాద్): గోలేటిలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో ఈ నెల 21న జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెస్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు కోట సుధాకర్, ప్రధాన కార్యదర్శి సామిల్ల సంపత్‌కుమార్ అన్నారు. గోలేటిలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా స్థాయి పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు తప్పనిసరిగా ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తమ వెంట తెచ్చుకోవాలని కోరారు. ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. జూన్ 9, 10, 11 తేదీల్లో గోలేటిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్రాజు శ్రీనివాస్ రావు, ఉపాధ్యక్షుడు బోగే ఉపేందర్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పోటు శ్రీధర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి నరేశ్, కోశాధికారి కుమ్మరి మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాలి



అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న బౌద్ధ భిక్షువులు, నాయకులు

వాంకిడి(ఆసిఫాబాద్): ప్రతిఒక్కరూ బాబా సాహెబ్ అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకుని ఆయన అడుగుజాడల్లో నడవాలని నాగ్‌పూర్‌కు చెందిన బౌద్ధ భిక్షువు బదంత్ ధమ్మ సారథి అన్నారు. మండల కేంద్రంలోని లక్ష్మీనగర్ వైశాలి బుద్ధ విహార ఆవరణలో ఏ ర్పా టు చేసిన బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. అంతకు ముందు సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ నగర్ నుంచి లక్ష్మీనగర్ వరకు చైతన్య ర్యాలీ నిర్వహించారు. బౌద్ధ మహాసభ మండల అధ్యక్షుడు జైరాం ఉప్రే పంచశీల జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎంపీపీ ముండె విమల బాయి, జెడ్పీటీసీ అజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతీ ఇంట్లో అంబేద్కర్ చరిత్ర, రచనలు ఉంచుకోవాలని సూ చించా రు. కార్యక్రమంలో సర్పంచులు తుకారాం, కమలాకర్, నాయకులు అశోక్ మహోల్కర్, చైతన్య, హేమంత్, తిరుపతి, విజయ్ ఉప్రే, రోషన్ ఉప్రే, విలాస్ ఉప్రే, సందీప్ పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



గురువులను సన్మానిస్తున్న నిర్వాహకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలలో ఆదివారం 1998– 99 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ శిశు మందిరాలు సంప్రదాయాలు, దేశభక్తికి నిలువెత్తు నిదర్శనాలు అని కొనియాడారు. గురువులు కిరణ్, బాలేశ్వర్‌ను శాలువాతో సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు గుండేటి కోటేశ్వర్‌రావు, చిలువేరు వెంకన్న, తాటికొండ ప్రవీణ్, వేణుగోపాల్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

తునికాకు సేకరణ షురూ

- 11 యూనిట్ల పరిధిలో 156 కల్లాలు
- 21,500 స్టాండర్డ్ బ్యాగుల లక్ష్యం
- వేసవిలో గిరిజనులు, గిరిజనేతరులకు ఆదాయం
- పులి సంచారం ఉన్నచోట ఆగిన తునికాకు సేకరణ



బెజ్జూర్‌లో తునికాకు కట్టలు కడుతున్న కుటుంబం

బెజ్జూర్(సిర్పూర్): వేసవి పంటగా భావించే తునికాకు సేకరణ జిల్లాలో ప్రారంభమైంది. వ్యవసాయ పనులు ముగిసిన తర్వాత గిరిజనులు, గిరిజనేతరులు ప్రధాన ఆదాయ వనరుగా తునికాకు సేకరణపై ఆధారపడతారు. అయితే కొన్నేళ్లుగా యూనిట్ల సంఖ్య తగ్గిపోవడంతో కూలీలు తునికాకు సేకరణకు దూరమవుతున్నారు.

20 కల్లాల్లో ప్రారంభం..

ఈ ఏడాది జిల్లాలో 11 యూనిట్ల పరిధిలో 156 కల్లాలను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇప్పటివరకు జిల్లాలో 20 కల్లాల పరిధిలో తునికాకు సేకరణ ప్రారంభమైంది. మిగిలిన చోట్ల సోమవారం నుంచి ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. 50 ఆకుల కట్టకు ప్రభుత్వం ఈ ఏడాది రూ.3లు చెల్లించాలని నిర్ణయించింది. వేసవిలో తునికాకు సేకరణ ప్రజలతోపాటు ప్రభుత్వానికి ఆదాయం తెచ్చిపెడుతోంది. గ్రామాల్లో తెల్లవారుజామునే ఎడ్లబండ్లలో కుటుంబ సమేతంగా తునికాకు కోసం అడవి బాట పడుతారు. ఇంటికి తెచ్చిన ఆకుల పేర్చి కట్టలు కట్టి కల్లాల్లో విక్రయిస్తారు. 1000 కట్టలను ఒక స్టాండర్డ్ బ్యాగుగా వ్యవహరిస్తారు.

అంతరించిపోతున్న చెట్లు..

గతంలో జిల్లాలో 2 లక్షల స్టాండర్డ్ బ్యాగుల వరకు తునికాకు సేకరించేవారు. దీంతో ఒక్కో కుటుంబానికి వేసవిలో రూ.10 వేల నుంచి రూ.20వేలకు పైగా ఆదాయం వచ్చేది. కానీ ప్రస్తుతం తునికాకు సేకరణ క్రమంగా తగ్గుతోంది. దీనికి తోడు అడవుల్లో తునికి చెట్లు అంతరించిపోతున్నాయి. పోడు వ్యవసాయంతోనే చెట్లు నరికివేతకు గురవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. అలాగే ఎండలు 45 డిగ్రీల సెల్సియస్ దాటుతుండటంతో పలువురు ఆసక్తి చూపడం లేదు.

'పెద్ద పులి' ప్రభావం..

జిల్లాలోని కాగజ్‌నగర్, పెంచికల్‌పేట్ రేంజ్‌ల పరిధిలో పులి సంచారం ఎక్కువగా ఉంటుంది. సమీప మండలాల్లోనూ పులి కదలికలు ఉంటాయి. ఈ ప్రభావం తునికాకు సేకరణపై పడింది. పులి సంచారం అధికంగా ఉండే అటవీ ప్రాంతాల్లోకి ప్రజలను అధికారులు అనుమతించడం లేదు. దీంతో జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో తునికాకు సేకరణ యూనిట్లను ఈ ఏడాది తొలగించారు. ఆసిఫాబాద్ డివిజన్ పరిధిలో తిర్యాణి, అడ, ఆసిఫాబాద్, రెబ్బెన, కేస్లాపూర్, దేవాయిగూడ, అత్తినితో పాటు మరో మూడు యూనిట్లు, కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో డబ్బా, బాలాజీ అనుకోడ, బొంబాయిగూడ, కడంబా యూనిట్లను తొలగించారు. ఇప్పటివరకు 170 వరకు కల్లాలను తొలగించారు.

ఆకులు దొరకడం లేదు



నా చిన్నప్పుడు తునికాకు తేవడం అంటే సంతోషంగా ఉండేది. డబ్బులు తక్కువగా వచ్చినప్పటికీ ఆకులు ఎక్కువగా దొరికేవి. ఇప్పుడు అడవిలో ఆకులు అంతగా దొరకడం లేదు. తునికాకు సేకరణకు ముందు నామమాత్రంగా రెండు రోజులు కొమ్మ కొట్టడం చేస్తున్నారు. ప్రభుత్వం కట్ట ధర పెంచాలి.

– వి.సుగుణబాయి, ఎల్కపల్లి

ఆసక్తి చూపడం లేదు

తునికాకు సేకరణకు గిరిజనులు, గిరిజనేతరులు ఆసక్తి చూపడం లేదు. ఉపాధిహామీ పనులకు వెళ్తే ఎక్కువ కూలి దక్కుతుందని భావిస్తున్నారు. తునికాకు సేకరణలో శ్రమకు తగిన ఫలితం రావడం లేదనే భావన గిరిజనుల్లో ఉంది. తునికాకు సేకరణ చేపడుతున్న మండలాల్లో పులి కదలికలు ఉన్న అటవీ ప్రాంతాల గురించి కూలీలకు అవగాహన కల్పిస్తున్నాం.

– దయాకర్, ఎఫ్‌ఆర్‌వో, బెజ్జూర్

కెరమెరి@ 45.4 డిగ్రీలు



కెరమెరి వారసంతలో ఎండ నుంచి రక్షణకు రుమాలు కట్టుకున్న వినియోగదారులు

కౌటాల /కెరమెరి: జిల్లాలో సూర్యుడి భగభగలు పెరిగిపోయాయి. ఆదివారం కెరమెరిలో పగటి ఉష్ణోగ్రత 45.4 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. చాలాచోట్ల ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల పైనే నమోదు కావడంతో వేడికి ప్రజలు అల్లాడుతున్నారు. ఆదివారం పలుచోట్ల నిర్వహించిన వార సంతలు వినియోగదారులు లేక వెలవెలబోయాయి. వడదెబ్బ బారిన పడే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

ఆదివారం నమోదైన ఉష్ణోగ్రతలు

ప్రాంతం	గరిష్టం		
కెరమెరి	45.4	ఎల్కపల్లి	42.8
జంబుగ	44.7	రవీంద్రనగర్	42.7
వంకులం	44.5	రెబ్బెన	42.6
కౌటాల	44.3	బెజ్జూర్	42.0
తిర్యాణి	43.1	ఆసిఫాబాద్	42.0

విధుల్లోకి జేపీఎస్‌లు



కౌటాలలో నిరసన వ్యక్తం చేస్తున్న జేపీఎస్‌లు (ఫైల్)

- సమ్మె విరమిస్తున్నట్లు కార్యదర్శుల ప్రకటన
- జిల్లాలో 267 మంది జేపీఎస్‌లు, ఓపీఎస్‌లు

కౌటాల(సిర్పూర్): సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో పోరుబాట పట్టిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తిరిగి విధుల్లోకి చేరుతున్నారు. జేపీఎస్‌ల సమ్మెను రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని చర్యలకు సిద్ధం కావడంతో మంత్రితో చర్చించి సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించారు.

చర్చలు సఫలం..

ప్రభుత్వం డెడ్‌లైన్ విధించడంతో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు హైదరాబాద్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో చర్చలు జరిపారు. శనివారంలోగా విధుల్లో చేరని జేపీఎస్‌లు, ఓపీఎస్‌ల స్థానంలో తాత్కాలిక పద్ధతిలో నియామకాలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించడంతో కార్యదర్శులు పునరాలోచనలో పడ్డారు. దీంతో మంత్రితో చర్చల అనంతరం సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించారు.

విధుల్లో చేరుతున్న కార్యదర్శులు..

జిల్లాలో 335 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. రెగ్యులర్ కార్యదర్శులతో పాటు 209 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, 58 మంది అవుట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారు. జేపీఎస్‌లు నిరవధిక సమ్మెకు వెళ్లడంతో పల్లెల్లో 16 రోజులపాటు రోజువారీ పనులకు ఆటంకం కలిగింది. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం కౌటాల,దహెగాం, చింతలమానెపల్లి, సిర్పూర్(టి) మండలాలాల్లో కార్యదర్శులు తిరిగి విధుల్లో చేరినట్లు ఎంపీడీవోలు వెల్లడించారు. సోమవారంలోగా మిగిలిన వారు విధుల్లో చేరుతారని వారు పేర్కొన్నారు.

సానుకూలంగా స్పందించారు



న్యాయమైన డిమాండ్ల కోసం సాధనకు చేపట్టిన నిరవధిక సమ్మెను రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు విరమించాం. జిల్లాలోని అన్ని మండలాల్లో కార్యదర్శులు తిరిగి విధుల్లో చేరుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్యలపై సానుకూలంగా స్పందించారు. సమ్మెకు స్పందించిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు.

– కృష్ణ, జేపీఎస్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు

నేటి నుంచి 'సీఎం కప్'

- క్రీడామైదానాలను సిద్ధం చేసిన అధికారులు
- మండల స్థాయిలో సత్తా చాటిన జట్లు జిల్లా స్థాయికి..



గోలేటిలో స్విమ్మింగ్ పూల్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న నిర్వాహకులు

ఆసిఫాబాద్‌అర్బన్: మండల కేంద్రాల్లో క్రీడా సంబురాలకు వేళయింది. గ్రామీణ యువతలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు సోమవారం నుంచి సీఎం కప్ క్రీడాపోటీలు నిర్వహించనున్నారు. మండల స్థాయి, జిల్లా స్థాయి పోటీల నిర్వహణకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది.

మూడు రోజులపాటు మండల స్థాయిలో..

జిల్లాలోని 15 మండలాలు ఉన్నాయి. ఈ నెల 15 నుంచి 17 వరకు మూడు రోజుల పాటు మండల కేంద్రాల్లో మండల స్థాయి పోటీలు ప్రారంభం కానున్నాయి. క్రీడాకారుల సౌలభ్యం కోసం ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, వాలీబాల్, హ్యాండ్‌బాల్ కోర్టులు ఏర్పాటు చేశారు. అలాగే అథ్లెటిక్స్, స్విమ్మింగ్ పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. క్రీడాకారులకు భోజన సౌకర్యం కల్పించనున్నారు. 15 నుంచి 30 ఏళ్లలోపు క్రీడాకారులు పోటీలకు అర్హులు. ఇక్కడ సత్తా చాటిన క్రీడాకారులు, మొదటి స్థానంలో నిలిచిన జట్లను జిల్లా స్థాయికి ఎంపిక చేస్తారు. ఈ నెల 22 నుంచి 24 వరకు జిల్లా స్థాయి క్రీడలు నిర్వహిస్తారు. ఇందుకోసం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలోని మైదానం, కాగజ్‌నగర్‌లోని క్లబ్, రెబ్బెన మండలం గోలేటి భీమన్న స్టేడియంలో ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లను రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తారు. పోటీలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న క్రీడాకారులు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆధార్ కార్డుతో వివరాలు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు సూచిస్తున్నారు.

విజేతలకు సర్టిఫికెట్లు

గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారుల ప్రతిభను వెలుగులోకి తెచ్చేందుకు సీఎం కప్ పోటీలు ఎంతో ఉపయోకరంగా ఉంటాయని నిర్వాహకులు చెబుతున్నారు. శిక్షణతో క్రీడాకారులు మరింత నైపుణ్యత సాధించేందుకు ఆస్కారం ఉంటుంది. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులతోపాటు సర్టిఫికెట్లు ప్రదానం చేయన్నారు.

నిత్యం భగవన్నామ స్మరణ చేయాలి

- యోగానంద సరస్వతి స్వామి

ఆదిలాబాద్: చిన్నారులు నిత్యం భగవన్నామ స్మరణ చేయాలని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠాధిపతి యోగానంద సరస్వతి స్వామి అన్నారు. జిల్లా కేంద్రంలోని మఠంలో రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో 20 రోజులుగా కొనసాగుతున్న బాల సంస్కార్ శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలని, వారిని గౌరవించాలన్నారు. పిల్లల్లో విలువలు పెంచేలా ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు భూమన్న, ప్రధాన కార్యదర్శి లెనిన్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భీం ఆశయ సాధనకు కృషి



కుమురంభీం విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే కోనప్ప, తదితరులు



ఆదివాసీ కళాకారుల నృత్యం

కౌటాల(సిర్పూర్): పోరాట యోధుడు కుమురంభీం ఆశయ సాధనకు కృషి చేస్తామని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. కౌటాల మండలం తుమ్మిడిహెట్టి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన కుమురం భీం విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల సాధనకు భీం ఎనలేని పోరాటం చేశారన్నారు. భీం అడుగుజాడల్లో ప్రతిఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. ఆదివాసీలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వృద్ధి చెందాలన్నారు. గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని, వారి సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెడుతుందని తెలిపారు. విగ్రహావిష్కరణ సందర్భంగా గిరిజన కళాకారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. గ్రామస్తులు విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య, ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్, సర్పంచ్ పోరేతు చరందాస్, ఎంపీటీసీ మనీశ్, నాయకులు మధుకర్, పత్రు, పోచాని, బండు, పోశయ్య, విఘ్నేశ్ తదితరులు పాల్గొన్నారు.

యూడైస్ ప్లస్.. మొక్కు'బడి'గా!

- ఆన్‌లైన్ నమోదులో ఉదాసీనత
- విద్యార్థుల వివరాల నమోదుపై అలసత్వం
- నేటితో ముగియనున్న గడువు



యూడైస్ ప్లస్ పోర్టల్

మంచిర్యాలఅర్బన్: సాంకేతిక రంగంలో మార్పులకు అనుగుణంగా ముందుకు సాగాల్సిన పాఠశాలల యాజమాన్యాలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయి. సమాచార పారదర్శకత, అన్ని రాష్ట్రాల విద్యార్థుల వివరాలు ఒకే పోర్టల్‌లో ఉండాలని కేంద్రం యూడైస్ ప్లస్(వెరిఫికేషన్) పేరుతో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ చేపట్టింది. ప్రతీ పాఠశాలలోని విద్యార్థి వివరాలు ఇందులో నమోదు చేయాల్సి ఉంది. ఆన్‌లైన్ నమోదు లేకపోతే ఆ విద్యార్థులకు సంబంధించి స్కాలర్‌షిప్, సర్టిఫికెట్ జారీ, ఇతర సందర్భాల్లో ఇబ్బందులు తలెత్తనున్నాయి. ఈ సెంట్రల్ పోర్టల్‌ను 30 నిమిషాల్లో 100 మంది విద్యార్థుల వివరాలు నమోదు చేసి అప్రూవ్ చేసేలా డిజైన్ చేశారు. 2022–23కు సంబంధించి విద్యార్థుల వివరాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ఫిబ్రవరిలో ప్రారంభించారు. ఈనెల 15న(సోమవారంతో)గడువు ముగియనుంది. అయితే ఉమ్మడి జిల్లాలోని ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల నుంచి స్పందన పెద్దగా లేదు. విద్యాశాఖలో ఎన్ని యాప్‌లు వచ్చినా ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ అంతంతమాత్రంగానే నమోదు చేస్తున్నారనే విమర్శలున్నాయి.

విద్యార్థుల పూర్తి సమాచారం..

విద్యార్థుల పూర్తి సమాచారం తెలిపేలా ఇందులో డాటా ఎంట్రీ చేస్తారు. పాఠశాల పేరు, మండలం, విద్యార్థి పూర్తిపేరు, తల్లిదండ్రులు, కులం, మాట్లాడే భాష, పుట్టిన ఊరు, ప్రస్తుత నివాసం, పుట్టిన తేదీ, పూర్వ పాఠశాల, ఏ సంవత్సరం ఎక్కడ చదువుకుంది. మీడియం, బ్లడ్‌గ్రూప్, ఎత్తు, బరువు, పాఠశాల నుంచి ఇంటికి ఎంత దూరం, విద్యార్థి బ్యాంకు ఖాతాల వివరాలు పొందుపరుస్తారు.

సాంకేతిక కారణాలతో..

ఉమ్మడి జిల్లాలోని ఆయా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు పోర్టల్‌లో వివరాల నమోదుకు సాంకేతిక కారణాలు సాకుగా చూపుతున్నాయి. ప్రస్తుతం సెలవులను సాకుగా చూపి నమోదు గడువు ముగుస్తున్నా స్పందించడం లేదని తెలుస్తోంది. కొంతమంది గడువు పెంచకపోతారా అని కావాలనే జాప్యం చేస్తున్నట్లు సమాచారం. ఇక కళాశాలల యాజమాన్యాలు అది తమ పని కాదని తప్పించుకుంటున్నారు. అయితే యూడైస్ నంబర్ ఆధారంగానే స్కాలర్‌షిప్ మంజూరయ్యే వీలుంటుంది.

గతంలో స్టూడెంట్ ఇన్ఫోలో..

ఇంతకుముందు స్టూడెంట్ ఇన్ఫోలో విద్యార్థుల వివరాలు ఉండేవి. ఇది రాష్ట్రస్థాయిలో ఉండేది. ప్రస్తుతం సెంట్రల్ పోర్టల్‌లో నమోదు చేయడం ద్వారా విద్యార్థి ఎక్కడ చదివేది ఇట్టే తెలిసిపోనుంది. తద్వారా సర్టిఫికెట్ల జారీ కూడా సులువుకానుంది. ఒక్క మంచిర్యాల జిల్లాలోనే 2022–23 ప్రకారం 1,079 పాఠశాలలకు చెందిన 1,28,712 మంది విద్యార్థులు యూడైస్ ప్లస్‌లో నమోదు చేయాలి. ఈనెల 14 వరకు కేవలం 49,500 మంది విద్యార్థుల వివరాలు మాత్రమే నమోదు చేశారు. మూడు నెలల్లో 39 శాతం పూర్తి కాగా మిగిలిన 61 శాతం నమోదుకు ఎన్ని రోజులు తీసుకుంటారన్న ప్రశ్న తలెత్తుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించిఆన్‌లైన్ నమోదు ప్రక్రియపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.


ఈనెల 14వ తేదీ మధ్యాహ్నం 12 గంటల వరకు ఉమ్మడి జిల్లాలో వివరాల నమోదు ఇలా..

జిల్లా	విద్యార్థులు	నాన్‌స్టార్టడ్	కంప్లీట్ చేసినవి	శాతం
ఆదిలాబాద్	1,52,739	1,31,578	20,960	13.72
కుమురంభీం	1,04,472	80,922	23,374	22.37
మంచిర్యాల	1,28,712	82,496	45,253	35.16
నిర్మల్	1,42,208	48,272	93,832	65.98

పాఠశాలల వారీగా వివరాలు..

జిల్లా	స్కూళ్లసంఖ్య	నాన్‌స్టార్టడ్	ఇన్‌ప్రోగ్రెస్	కంప్లీటెడ్
ఆదిలాబాద్	1,447	1,090	154	233
కుమురంభీం	1,271	871	19	209
మంచిర్యాల	1,079	526	161	392
నిర్మల్	1,081	226	157	698

లక్ష్యం దిశగా సాగాలి



మాట్లాడుతున్న డీఈవో అశోక్

కాగజ్‌నగర్‌టౌన్: విద్యార్థులు లక్ష్యం దిశగా ముందుకు సాగాలని జిల్లా విద్యాశాఖ అధికారి పార్శి అశోక్ అన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు కాగజ్‌నగర్ పట్టణంలోని డీఆర్సీ కేంద్రంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టీఎస్‌ఆర్‌జేసీ, ఇతర ప్రవేశ పరీక్షల శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆదివారం హాజరయ్యారు. నెలరోజులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరైన విద్యార్థులను అభినందించారు. కరోనా సమయంలో పాఠశాల నిర్వహణ లేక విషయ పరిజ్ఞానం లోపించిందన్నారు. ఆర్జీరావు ట్రస్ట్ నిర్వహించిన పరీక్షలో అత్యున్నత ప్రతిభ కనబర్చిన ఆదిత్యరామ్, చౌదరి శంకర్, శివసాయి, బాపుసాయి, తేజలకు ఉచిత ఐఐటీ కోచింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు ట్రస్ట్ ప్రతినిధులు ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. అలాగే సంజీవిని ఐఐటీ అకాడమీ నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ చూపిన సంజన, చౌదరి శంకర్, ఆదిత్యరామ్‌ను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కటుకం మధుకర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య


సాయిలు(ఫైల్)

లోకేశ్వరం(ముథోల్): పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కన్కపూర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దూదిగాం సాయిలు(40) కొంత కాలంగా మతిస్థిమితం కోల్పోయాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా వ్యాధి నయం కాలేదు. శనివారం సాయంత్రం ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆటోలో భైంసాలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య సుజాత, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో మేక మృతి


మృతి చెందిన మేక

నెన్నెల(బెల్లంపల్లి): మండలంలోని నార్వాయిపేటలో విద్యుదాఘాతంతో మేక మృతి చెందింది. గ్రామానికి చెందిన లావుడియ హరీశ్‌సింగ్‌నాయక్‌కు చెందిన మేక ఆదివారం మేతకోసం గ్రామ సమీపంలోని పంటచేల వైపు వెళ్లింది. పంటపొలంలో ట్రాన్స్‌ఫార్మర్ కిందికి ఉండడంతో అటుగా వెళ్లిన మేక ఎర్త్‌వైరుకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. మేక విలువ రూ.10 వేలు ఉంటుందని, ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


రమేశ్(ఫైల్)

జన్నారం(ఖానాపూర్): ఈ నెల 9న మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రేండ్లగూడ గ్రామానికి చెందిన అల్లం రమేశ్ (32) ఈ నెల 9న గ్రామ శివారులో అతిగా మద్యం సేవించాడు. అదే మత్తులో పురుగుల మందుతాగి ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులకు తెలుపడంతో కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


కాలిపోయిన ఇల్లు

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని గోలేటి విలేజ్‌లో ఆదివారం సాయంత్రం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. బాధితుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన గుగులోత్ శంకర్, గుగులోత్ మంజు, గుగులోత్ రవికి చెందిన పెంకుటింట్లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన కుటుంబ సభ్యులు స్థానికులు బిందెలు, బకెట్లతో నీళ్లు చల్లినా మంటలు అదుపులోకి రాకపోవడంతో ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదంలో ఇంట్లో ఉన్న సామగ్రి, ఎడ్లబండి, మోటర్ సైకిల్, ఇంటి సామగ్రి, టేకుకర్రలు పూర్తిగా కాలిపోయాయి. సమాచారం తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదంలో జరిగిన ఆస్తి నష్టంపై పంచనామా నిర్వహించారు. ప్రమాదంలో దాదాపు రూ.10 లక్షల వరకు ఆస్తినష్టం జరిగిందని బాధితులు వాపోయారు.

పల్లెటూరు.. అమ్మతీరు


ఎడ్లబండిపై చిన్నారి

- వేసవి సెలవుల్లో పల్లెబాట పట్టిన పిల్లలు
- పొలం గట్లు, ఊర చెరువులు, తోటల వద్ద సందడి
- మూగజీవాలు, ఎడ్లబండ్లతో చిన్నారుల ఆటపాటలు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఊరూ పల్లెటూరు.. దీనితీరే అమ్మతీరు.. అంటూ ఇటీవల వచ్చిన సినిమా పాటను తలపించినట్లుగా పట్నం నుంచి వచ్చిన చిన్నారులు పల్లెల్లో వేసవి సెలవులను ఆస్వాదిస్తున్నారు. గత నెలలో పరీక్షలు ముగిశాయి. ఏప్రిల్ 23 నుంచి పాఠశాలలకు వేసవి సెలవులొచ్చాయి. ఇంకేం.. పట్టణ ప్రాంతాల నుంచి గ్రామాల్లోని అమ్మమ్మ, నానామ్మ..తాతయ్యల ఊళ్ల బాట పట్టారు. పుస్తకాలు, పెన్నులు, హోంవర్క్, స్కూల్ బ్యాగులను పక్కన పడేసిన చిన్నారులు చెరువులు, కాల్వ గట్లు, మామిడితోటలు, పంట పొలాలు, ఎడ్లబండ్లతో ఆటపాటలు సాగిస్తున్నారు.

పల్లెల్లో పిల్లల సందడి..

గ్రామాల్లో చెట్టు నీడన పిల్ల సందడి నెలకొంటుంది. పట్టణం ఉంటున్న ఎత్తైన భవనాలు, భారీ రంగురంగుల ఖరీదైన కార్లు, ఇతర భారీ వాహనాల చప్పుళ్ల మోతా, పొల్యూషన్ నుంచి ఒక్కసారిగా పల్లెలోని పూరిగుడెసెలు, పెంకుటిల్లులు, ఎడ్లబండ్లు, పక్షుల చప్పుడు, ఆహ్లాదకరమైన పలకరింపులుతో కొంత అనుభూతిని పొందుతున్నారు. ఆవులు, గేదెలు, మేకలు, తదితర మూగజీవాలు, చెరువులు, కుంటలు, వాగులు, కాల్వల్లో లభించే చేపపిల్లలతో మురిసిపోతున్నారు. స్నేహితులుగా మారి ఇక్కడి ఆటపాటలతో ప్రేమగా కలిసిపోతున్నారు.


అమ్మమ్మతో చిన్నారులు


చెట్టుపైకి ఎక్కి ఆడుతున్న చిన్నారులు


చెరువు గట్టు వద్ద హైదరాబాద్ నుంచి నెన్నెల గ్రామానికి వచ్చిన చిన్నారులు, కుటుంబ సభ్యులు


రొయ్యతో చిన్నారి


నంనూర్‌లో గోలీలు ఆడుతున్న చిన్నారులు

సెలవుల్లో అమ్మమ్మ ఊరికి..



సెలవులు రావడంతో హైదరాబాద్ నుంచి అమ్మమ్మ ఊరికి వచ్చినం. ఇక్కడ బామ్మ ఒక్కతే ఉంటుంది. మేము రావడంతో ఎంతో సంతోషం వ్యక్తం చేసింది. రోజంతా ఇంటి వద్ద పేరట్లో ఆడుకోవడం, మామిడి తోటల్లో కోతికొమ్మ ఆడుకోవడం, ప్రాజెక్టు వాటర్ చూశాం ఎంత బాగనిపిస్తుంది. – మురుకూరి లక్ష్మిసహస్ర

హాలీడేస్ ఫుల్ ఎంజాయ్..



మేము హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ఉంటున్నాం. అక్కడే నేను చదువుకుంటున్న.. మా మమ్మి, డాడి అక్కడే జాబ్ చేస్తున్నారు. ఎగ్జామ్స్ అయిపోయాయి. డాడీ వాళ్ల స్వంత ఊరు నెన్నెల (నానమ్మ ఊరు)కు చెల్లి నేను వచ్చాం. ఇక్కడ ఎడ్లబండ్లు, చెరువులు, పొలంగట్లు చెట్ల నీడన ఫ్రెండ్స్‌తో కలిసి ఆడుకుంటున్నాం. – కొండ జనని కృతి, హైదరాబాద్

గ్రామాల్లో నాటి ఆటలు..
గోలీల ఆట ఓవైపు.. పులి–మేక మరోవైపు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): నాటి ఆటలు ఆరోగ్యంతో పాటు అనుబంధాన్ని పెంచేవి. ఇప్పుడైతే అంతా సెల్‌లతో ఆటలు ఆడుతూ అనారోగ్యాలను కొనితెచ్చుకుంటున్న సందర్భాలు.. గతంలో మైదానాల్లో క్రికెట్, చిర్రగోనె, గోలీలు ఇలా ఎన్నో ఆటలు ఆడేవారు. కనుమరుగైన ఆలనాటి ఆటలు ఇప్పుడు మళ్లీ గ్రామాల్లో కనిపిస్తున్నాయి. హాజీపూర్ మండలం రాపల్లి గ్రామంలోని ఓ వీధిలో వాడ పెద్దలు కలిసి ఇలా కల్వర్టు సైడ్ వాల్‌పై ఇలా కూర్చుని పులి–మేక ఆట ఆడుతూ సరదాగా గడుపుతున్నారు. నంనూర్ గ్రామంలో చిన్నారులు సరదాగా గోలీల ఆట ఆడుతూ కనిపించారు.

పిల్లలను వదిలి యాడికెళ్తివి కొడుకా..

- ఇటీవలే కిడ్నీలు ఫెయిల్
- చికిత్స పొందుతూ మృతి


ప్రభాకర్(ఫైల్)


రోదిస్తున్న తల్లిదండ్రులు

వేమనపల్లి(బెల్లంపల్లి): ట్రాక్టర్ బండి అచ్చింది.. బాపు అత్తలేడని మీ ఇద్దరు పిల్లలు అడుగుతాండ్రు.. పిల్లలను వదిలి నీవు యాడికెళ్తివి కొడుకా.. అంటూ ఆ తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు స్థానికులను కంటతడి పెట్టించింది. మండల కేంద్రానికి చెందిన తెల్ల వెంకటి, ఎర్రక్క దంపతుల కుమారుడు ప్రభాకర్ (26) ఎనిమిదేళ్లుగా ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి భార్య రజిత, ఇద్దరు పిల్లలున్నారు. ఇటీవలే కిడ్నీలు ఫెయిల్ కావడంతో ప్రభాకర్ అనారోగ్యానికి గురయ్యాడు. మంచిర్యాల ఆస్పత్రిలో చికిత్స చేయించినా నయంకాలేదు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. లోకం తెలియని కుమారుడు అక్షయ్, చంటి పాప ఆరాధ్య తండ్రి మృతి చెందాడన్న విషయం తెలియక బాపు ఏడని అడుగుతుంటే పలువురు కన్నీటిపర్యంతమయ్యారు.

ప్రమాదవశాత్తు మొక్కజొన్న పంట దగ్ధం


దగ్ధమైన మొక్కజొన్న పంట

సారంగపూర్(నిర్మల్): ప్రమాదవశాత్తు మొక్కజొన్న పంట దగ్ధమైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని జామ్ గ్రామానికి చెందిన రాజారపు భోజన్న తనకున్న నాలుగెకరాల్లో మొక్కజొన్న పంటను కోసి నూర్పిడికి సిద్ధంగా ఉంచాడు. ఆదివారం ప్రమాదవశాత్తూ పంటకు నిప్పంటుకోవడంతో పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదంలో సుమారు 2.40 లక్షల ఆస్తినష్టం జరిగిందని బాధితుడు వాపోతున్నాడు. ఇదే తరహాలో రాంసింగ్ తండాకు చెందిన మాన్సి అనే రైతుకు చెందిన ఎకరం నర మొక్కజొన్న పంట కోత కోసి నూర్పిడికి సిద్ధంగా ఉంచాడు. ప్రమాదవశాత్తు పంటకు నిప్పంటుకోవడంతో దగ్ధమైంది. సుమారు 1.80 లక్షల ఆస్తినష్టం జరిగిందని బాధితుడు వాపోతున్నాడు. అగ్నిమాపక యంత్రానికి సమాచారం ఇచ్చినా సకాలంలో రాకపోవడంతో పంట పూర్తిగా దగ్ధమైందని బాధిత రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

చెరువులో దూకి వృద్ధుడు ఆత్మహత్య

కుంటాల(ముథోల్): చెరువులో దూకి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ఓలాలో చోటు చేసుకుంది. ఎస్సై హన్మాండ్లు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన షేక్‌చాంద్‌పాషా(60) భార్య ఆరునెలల క్రితం మృతి చెందింది. అప్పటి నుంచి మనోవేదనకు గురయ్యాడు. ఆదివారం ఉదయం ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఓలా శివారులోని గోవింద్‌రావు చెరువులో మృతదేహాన్ని గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతునికి ఐదుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

తానూరు(ముథోల్): మండలంలోని బామ్ని ఎక్స్‌రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. మహారాష్ట్రలోని ధర్మాబాద్ తాలూకా కర్కెల్లి గ్రామానికి చెందిన బత్తుల్‌వార్ చంద్రకళ (40), ఆమె కుమారుడు సాయిబు, కుమార్తె సాయిబాయి, మనుమడు (18నెలలు) ఆదివారం ద్విచక్ర వాహనంపై కుభీర్ మండలంలోని సావ్లి గ్రామానికి వెళ్లారు. తిరుగుప్రయాణంలో బామ్ని ఎక్స్‌రోడ్డు వద్ద గుంతలోకి దిగిన బైక్ కుదిపేయడంతో బాలుడు జారి కిందపడిపోయాడు. వెంటనే తల్లి సాయిబాయి, అమ్మమ్మ చంద్రకళ వాహనం పైనుంచి కిందకు దూకారు. చంద్రకళ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎస్సై విక్రమ్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారులపై గుంతలవు పూడ్చివేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

- పంటను ఆశించే చీడపీడల బెడద నివారించవచ్చు
- ఎరువుల వినియోగం చాలావరకు తగ్గుతుంది

విత్తనశుద్ధితో అధిక దిగుబడులు


జాడి బాపు, ఏడీఏ, చెన్నూర్


విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న అధికారులు(ఫైల్)

చెన్నూర్‌రూరల్: విత్తనశుద్ధితో అధిక దిగుబడులు సాధించవచ్చని చెన్నూర్ ఏడీఏ జాడి బాపు సూచిస్తున్నారు. శుద్ధి చేసిన విత్తనానికి వ్యాపించే తెగుళ్లను, మొలకదశలో ఆశించే చీడపీడలను సమర్థవంతంగా అరికట్టవచ్చని పేర్కొంటున్నారు. ఈ ఏడాది వానాకాలం సాగు సీజన్ సమీపిస్తున్నందువల్ల రైతులు ముందుగానే విత్తనశుద్ధి చేసుకుంటే మంచిదని సూచిస్తున్నారు.

విత్తనశుద్ధి ఇలా..

వరి: వరి విత్తనాన్ని శుద్ధి చేయాలంటే కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బెండిజమ్ కలిపి శుద్ధి చేసుకోవాలి. లేదా లీటరు నీటికి గ్రాము కార్బెండిజమ్ కలిపి ఆ ద్రావణంలో విత్తనాన్ని 24 గంటల పాటు నానబెట్టి తడి విత్తనశుద్ధి చేయాలి.

మొక్కజొన్న: ఒక కిలో మొక్కజొన్న విత్తనానికి 3 గ్రాముల మాంకోజెబ్ లేదా థైరమ్ లేదా కోప్టాన్‌తో పొడి విత్తనశుద్ధి చేసుకోవాలి.

పల్లి: పల్లి విత్తనం శుద్ధికోసం 2ఎంఎల్ ఇమిడాక్లోప్రిడ్ 600 ఎఫ్ఎస్, 6 ఎంఎల్ నీటిలో కలిపి కిలో విత్తనానికి పట్టించాలి. ఒక గంట నీడలో ఆరబెట్టి 3గ్రాముల మాంకోజెబ్ లేదా గ్రాము టెబ్యుకొనజోల్ 2డీఎస్ పొడర్ పట్టించాలి.

పొద్దుతిరుగుడు: పొద్దు తిరుగుడు పంటను ఎక్కువగా అల్టనేరియా, ఆకుమచ్చ తెగులు ఆశిస్తుంది. దీని నివారణకు కిలో విత్తనానికి క్వింటాల్ అనే మందును (ఇప్రోడియోన్ 25శాతం, కార్బండిజమ్ 25శాతం)2 గ్రాములు పట్టించాలి. లేదా కిలో విత్తనానికి 5 గ్రాముల ఇమిడాక్లోపిడ్‌తో విత్తనశుద్ధి చేయాలి.

పత్తి: బీటీ రకం పత్తి విత్తనాన్ని ప్యాక్ చేసే సమయంలోనే ఇమిడాక్లోపిడ్ అనే మందుతో విత్తనశుద్ధి చేస్తారు. కాబట్టి అదనంగా విత్తనశుద్ధి చేసే అవసరం లేదు.

జొన్న: కిలో జొన్న విత్తనానికి థయోమిథాక్సమ్ 3 గ్రాములు, థైరమ్ 3 గ్రాములు కలిపి శుద్ధి చేయాలి.

పప్పు–అపరాల సాగు: ఏదేని పప్పు కిలో విత్తనానికి 3 గ్రాముల థైరామ్ లేదా 3 గ్రాముల కాప్టాన్ లేదా 3 గ్రాముల మాంకోజెబ్ మందుతో విత్తనశుద్ధి చేసుకోవాలి. తర్వాత అరగంట సేపు నీడలో ఆరనివ్వాలి. ఆతర్వాత 5 గ్రాముల థయోమిథాక్సమ్ లేదా 5ఎంఎల్ ఇమిడాక్లోపిడ్ మందుతో విత్తనశుద్ధి చేసి విత్తనాన్ని 4 నుంచి 5 గంటల పాటు నీడలో ఆరబెట్టాలి. ఇలా విత్తనశుద్ధి చేసుకుంటే పంటను చీడ పీడలు ఆశించవు. మందుల అవసరం కూడా ఎక్కువగా ఉండదు. పంట దిగుబడి కూడా అధికంగా వస్తుంది.

నిషేధం ఉన్నా ఆగని దందా

- ఏడేళ్లుగా జిల్లాలో బీజీ–3 సాగు
- గుట్టుచప్పుడు కాకుండా గ్రామాల్లో సరఫరా
- హరించనున్న జీవవైవిధ్యం


దహెగాంలో పట్టుబడిన నకిలీ విత్తనాలు (ఫైల్)

ఇచ్చోడ/పెంచికల్‌పేట్: ప్రభుత్వం బీజీ–3 పత్తి విత్తనాలను నిషేధించి ఏడేళ్లు కావస్తున్నా ఏటా ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో నకిలీ విత్తనాల దందా జోరుగా కొనసాగుతూనే ఉంది. కొంతమంది వ్యాపారులు ప్రతీ సంవత్సరం మార్చి, ఏప్రిల్, మే మాసాల్లో గుట్టుచప్పుడు కాకుండా విత్తనాలను గ్రామాల్లోకి చేరవేసి భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. తూర్పు జిల్లాతో పాటుగా ఇతర రాష్ట్రాల నుంచి రైలుమార్గం ద్వారా విత్తనాలను దిగుమతి చేసుకుని దందా కొనసాగిస్తున్నారు.

గుట్టుచప్పుడు కాకుండా దందా

కొంతమంది వ్యాపారులు తమ ఏజెంట్ల ద్వారా నిషేధిత బీజీ–3 పత్తి విత్తనాలను గుట్టుచప్పుడు కాకుండా గ్రామాల్లోకి చేరవేస్తున్నట్లు తెలుస్తోంది. నకిలీ విత్తనాల దందాను చేసే వ్యాపారులు జిల్లా వ్యాప్తంగా మారుమూల గ్రామాల్లో విత్తనాలను డంప్ చేసుకుని అక్కడి నుంచి ముందుస్తు ప్రణాళిక ద్వారా అక్కడి నుంచి అమాయక రైతులకు అంటగడుతున్నారు.

ఏజెన్సీ మండలాల్లోనే అధికం...

నిషేధిత బీజీ–3 పత్తి విత్తనాలను అత్యధికంగా ఏజెన్సీ మండలాల్లోని రైతులకు అంటగడుతున్నట్లు సమాచారం. ఏడేళ్లుగా దందా ఈ పద్ధతిలోనే కొనసాగుతోంది. వ్యవసాయ అధికారులు కేవలం విత్తనాల దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తుండడంతో నకిలీ విత్తనాల దందా యథావిధిగా కొనసాగుతున్నట్లు సమాచారం.

హరించనున్న జీవవైవిధ్యం..

నిషేధిత బీజీ–3 పత్తి విత్తనాల సాగు చేసిన రైతులు, గడ్డి నివారణ కోసం నిషేధిత గ్లైఫోసెట్ వాడుతారు. ఇది అతిగా వాడడం వల్ల పిచికారీ చేసిన వ్యక్తులు క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉంది. అంతేకాకుండా రాబోయే రోజుల్లో సారవంతమైన నల్లరేగడి నేలలు కలుషితం అవుతాయని, జీవవైవిధ్యానికి తీవ్రనష్టం కలుగుతుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

లక్ష ఎకరాల్లో బీజీ–3 సాగు

జీవవైవిధ్యానికి భంగం కలుగుతుందన్న శాస్త్రవేత్తల హెచ్చరికతో ఏడేళ్ల కిందట రాష్ట్ర ప్రభుత్వం బీజీ–3ని నిషేధించింది. కానీ జిల్లాలో ఎక్కువ మంది రైతులు గుట్టుచప్పుడు కాకుండా బీజీ–3 విత్తనాలు సాగు చేస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో ఏటా 3 లక్షల ఎకరాలకు పైగా పత్తి సాగవుతుండగా లక్ష ఎకరాల్లో నిషేధిత బీజీ–3 సాగుచేస్తున్నట్లు తెలుస్తోంది. కుమురంభీం జిల్లాలోని 3,20,000 ఎకరాల్లో రైతులు ఏటా పత్తి సాగు చేస్తుండగా ఆసిఫాబాద్, రెబ్బెన, దహెగాం, పెంచికల్‌పేట్, బెజ్జూర్, చింతలమానెపల్లి, సిర్పూర్(టి), కాగజ్‌నగర్, కౌటాల మండలాల్లో నకిలీ విత్తనాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

బీజీ–3 సాగుచేయొద్దు

బీజీ–3 విత్తనాలపై ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ రకం పత్తి విత్తనాలను రైతులు సాగు చేయవద్దు. నకిలీ విత్తనాలను అరికట్టడానికి చర్యలు తీసుకుంటున్నాం. నిషేధిత విత్తనాల సమాచారం తెలిస్తే సమాచారం అందించాలి. – పుల్లయ్య, డీఏవో, ఆదిలాబాద్

ఉమ్మడి జిల్లాలో ఇటీవల పట్టుబడిన నకిలీ విత్తనాలు

- ఏప్రిల్ 30 న మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలంలోని టేకులపల్లిలో రూ.15 లక్షల నకిలీ పత్తి విత్తనాలు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు.
- ఈ నెల 5న కుమురంభీం జిల్లా దహెగాం మండలంలోని గొర్రెగుట్టలో రూ.లక్షా 40 వేల విలువైన 37 కిలోల విత్తనాలను స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేశారు.
- ఈ నెల 12న ఆసిఫాబాద్ మండలంలోని బూరుగూడలో రూ.లక్షా 50వేల విలువైన 40 కిలోల విత్తనాలు స్వాధీనం చేసుకుని ఒకరిపై కేసు నమోదు చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: ఆర్థిక ఇబ్బందులతో ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై అక్బర్‌పాష తెలిపారు. శ్రీరాంపూర్‌లోని భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన ఎర్రబెల్లి బాలయ్య (65) సులభ్ కాంప్లెక్స్‌లో పనిచేస్తున్నాడు. అతని భార్య మూడేళ్లక్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి మనస్థాపానికి గురయ్యాడు. దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులు కూడా తోడుకావడంతో ఆదివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతునికి కుమారుడు రామకృష్ణ, కుమార్తె ఉన్నారు. కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఏఎస్సై తెలిపారు.